క్లుప్తంగా

పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1940



పిఠాపురంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది

పిఠాపురం: స్థానిక బాదం మాధవరావు ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో మంగళవారం నాటికి 1940 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ సిబ్బంది 1726 మంది, పోలీసులు 222 మంది, అత్యవసర సేవల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 109 మంది, హోమ్ ఓటింగ్ 47 మంది, 85 ఏళ్ల పైబడి వయసున్న వృద్ధులు 26 మంది, దివ్యాంగులు 21 మంది కలిపి మొత్తంగా 2,057 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. వారిలో ఇప్పటికే 1940 మంది ఓట్లు వేశారని అధికారులు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ బుధవారం కొనసాగనుంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి రాంసుందర్ రెడ్డి పర్యవేక్షించారు.

గొల్లమారెమ్మ తల్లికి సారె



గొల్లమారెమ్మ తల్లికి భక్తులు సమర్పించిన సారె

పిఠాపురం: పిఠాపురంలో కొలువై ఉన్న గొల్లమారెమ్మ తల్లికి స్థానిక మిరపకాయల వీధికి చెందిన మహిళలు 108 రకాల స్వీట్లతో భక్తులు సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చామంతి నాగేశ్వర రావు అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న గృహ ఆధారిత విద్య సేవలపై మంగళవారం ఆయన ఆరా తీశారు. విభిన్న ప్రతిభావంతుల ఇంటికి వెళ్లి విద్యనందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభా వంతుల విద్యార్థులకు మెరుగైన వైద్యం, విద్య సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

పెద్దాపురం: ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు తమ విద్యను కొనసాగించాలని మహారాణి కళాశాల హెచ్ఓడీ గంగాధరుడు, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం వేసవి శిబిరాన్ని వారు ప్రారంభించారు. పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన ఈ శిబిరాన్ని ప్రారంభించారు. నక్షత్ర దంత ఆసుపత్రి వైద్యులు జమ్మి శిరీష, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు, క్యాంప్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం



ఆనూరులో అల్లూరి వర్ధంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వరహాలయ్యపేటలో నిర్వహించారు. అక్కడి అల్లూరి విగ్రహానికి, పాత బస్టాండ్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ నేటి యువత సామాజిక అవగాహన పెంచుకుని అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. డి.క్రాంతికుమార్, సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. ఆనూరు గ్రామంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు నివాళులర్పించారు.

మా ఉసురు మీకు తగలక మానదు

- చంద్రబాబు కుటిల రాజకీయంపై పండుటాకుల ఆగ్రహం
- బ్యాంకుల వద్ద పింఛను సొమ్ము కోసం పడిగాపులు



కొత్తపల్లి యూనియన్ బ్యాంకులో పెన్షన్‌దారుల కష్టాలు

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న పింఛను సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరిగి తీవ్ర అవస్థలకు గురవుతున్న అవ్వాతాతల పింఛను కష్టాలకు చెక్ పెట్టారు. వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ అందేలా చేశారు. ఈ నేపథ్యంలో పింఛన్‌దారులంతా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేయడం ఖాయమని నిర్ణయానికి వచ్చేసిన చంద్రబాబు కుటిల రాజకీయానికి తెర లేపారు. మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ ప్రసాద్‌ను అడ్డం పెట్టుకొని ఎన్నికల సమయంలో వలంటీర్లు పెన్షన్ పంపిణీ చేయడానికి వీల్లేదంటూ కోర్టును ఆశ్రయించేలా చేశారు. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్లను అందించే బాధ్యత నుంచి వలంటీర్లను తప్పించేలా చేసి పండుటాకులంతా పింఛన్ సొమ్ము కోసం ముప్పుతిప్పలు పడేలా చేశారు. అందుకే పింఛన్‌దారులంతా ఐదేళ్ల క్రితం టీడీపీ పాలనలో పడిన కష్టాలను గుర్తుకు తెచ్చుకుని 'మా ఉసురు మీకు తగలక మానదు' అంటూ చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ అడ్డగోలు రాజకీయాల కారణంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పింఛన్లను వలంటీర్లు నేరుగా లబ్ధిదారులకు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో మే నెలకు సంబంధించి నేరుగా పింఛన్‌దారుల ఖాతాల్లో సొమ్ము వేశారు. కొత్తపల్లి మండలంలోని 12,876 మంది పింఛనుదారులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యింది. దీంతో లబ్ధిదారులంతా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. ఒకటో తేదీన అందాల్సిన పింఛన్ బ్యాంకు ఖాతాల్లో వేయడంతో ఏడో తేదీ వచ్చినా లబ్ధిదారుల చేతుల్లోకి చేరలేదు. ఒకేసారి వందలాది మంది లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు వస్తుండడంతో సిబ్బంది పెన్షన్ల విత్‌డ్రా ఫామ్స్ రాయలేక, వచ్చిన వారికి సమాధానం చెప్పలేక తీవ్ర అసహనానికి గురవుతున్నారు. దీంతో బ్యాంకుల్లో వేగంగా పనవ్వక లబ్ధిదారులంతా మళ్లీ మళ్లీ బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల ఏడో తేదీ మంగళవారం కూడా పింఛన్లు తీసుకునేందుకు అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతకాలం హాయిగా ఇంటి వద్దే పింఛన్ తీసుకున్న తమపై చంద్రబాబు కక్ష సాధింపుకు పాల్పడుతున్నారని వృద్ధులు కన్నీరు పెట్టుకున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ చేసిన పాపానికి తగిన ఫలితం అనుభవించక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇది చాలా దుర్మార్గం



జగన్‌బాబు ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి ఇంటికే పెన్షన్ తీసుకొచ్చి ఇస్తున్నారు. టీడీపీ మా పింఛన్‌దారుల మీద కక్ష కట్టి మాకు పింఛన్ ఇంటి వద్దకు అందకుండా చేయడం చాలా దుర్మార్గం. వాళ్లు చేసిన పని వల్ల సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఈ నెల 7వ తేదీన గాని బ్యాంకు నుంచి పింఛన్ తీసుకోలేకపోయాం.

– బత్తుల చంద్రావతి, ఉప్పాడ

రాజకీయం కోసం బాధ పెడతారా?



టీడీపీ తమ రాజకీయం కోసం పింఛన్‌దారులను బాధ పెట్టడం ఎంత వరకు సరైన నిర్ణయం. వృద్ధులు, దివ్యాంగుల విషయంలో ఇలా ప్రవర్తిస్తే ఎవరైనా ఓటేస్తారా..? ఐదేళ్లు హాయిగా బయటకు రాకుండా ఒకటో తేదీనే పింఛన్ తీసుకున్నాం. ఇప్పుడు మా జీవితాలను ఎండలో రోడ్డు పాలు చేశారు.

– ఫక్కుర్తి భద్రం, వాకతిప్ప

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ఆధ్వర్యంలో మండలంలోని వాకతిప్పకు చెందిన వెల్లంకి వజ్రం, పెంకే రాంబాబు, పెంకే కృష్ణతో పాటు పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఘనంగా అమ్మవారి తీర్థాలు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల జాతరలు, తీర్థాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొండెవరం గ్రామంలో వేంచేసియున్న పెద్దింటమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. వాకతిప్ప గ్రామ దేవత ఆదిలక్ష్మి అమ్మవారి జాతర వైభవంగా జరిపారు. పొన్నాడ శివారు రావివారిపోడులో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

స్థానికునిగా ఓ అవకాశం ఇవ్వండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- వీకే రాయపురంలో విస్తృతంగా ప్రచారం



వీకే రాయపురంలో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న దొరబాబు

సామర్లకోట: స్థానికునిగా మీ ముందుకు వస్తున్నా.. ఒకసారి అవకాశం ఇవ్వండని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలో వీకే రాయపురంలో పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, పార్టీ నాయకులు వెలమర్తి బుల్లి రాజు, ఇంటి వెంకట్రావు, బదిరెడ్డి వీరప్రకాశరావు, రేలంగి రాంబాబు, ఓదూరి నాగేష్, కోట యోగి చల్లా శ్రీనుల ఆధ్వర్యంలో వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో భారీ జనసందోహం మధ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీఎం జగన్ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఉంటే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని ఆరోపించిన ప్రతిపక్ష నాయకులు కల్లబొల్లి హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని ఆరోపించారు. జగన్ సంక్షేమ పథకాలు ఇస్తే రాష్ట్రం శ్రీలంక, చంద్రబాబు ఇస్తే సింగపూర్ అవుతుందా? ప్రజలే ఆలోచన చేయాలన్నారు. సీఎం ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి ఒక రికార్డు సృష్టించారన్నారు. మాట ఇస్తే అమలు చేసే నాయకుడిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. మహాత్మగాంధీ ఆశయాల అమలులో భాగంగా ప్రజల వద్దకే పాలన అందించాలనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థను జగన్ అమల్లోకి తీసుకువచ్చారని చెప్పారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి వలంటీర్ సేవలు అందకుండా చేశారని ఆరోపించారు. టీడీపీ మేనిఫెస్టోలో వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇవ్వడం విడూరంగా లేదా అని అన్నారు. ప్రతి ఇంటా చాలా కాలం తరువాత స్థానికుడు పోటీ చేయడం తమకు ఎంతో సంతోషంగా ఉందని దొరబాబుకు ఆశీస్సులు అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, విద్యా కమిటీ చైర్మన్ వెలమర్తి శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టండి

పెద్దాపురం: రాష్ట్రంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని గుర్తించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేసి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. మంగళవారం మండలంలోని తాటిపర్తి, చంద్రమాంపల్లి గ్రామాల్లో ఓట్లను అభ్యర్థించారు. పులిమేరు పీఏసీఎస్ నాయకులు గోపు నారాయణమూర్తి, ఉప సర్పంచ్ గోపు మురళి, చంద్రమాంపల్లి గ్రామ సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు, వేముల పండు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, కనపర్తి బాబి, పెంటా విజయ్‌కుమార్, యినకోండ వీర విష్ణుచక్రం, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు, వారా సుధాకర్ అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

- తెగి పడిన విద్యుత్తు వైర్లు
- ఏడు గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



సామర్లకోట రథం సెంటర్‌లో నీట మునిగిన రోడ్డు



పిఠాపురంలో కురుస్తున్న వర్షం

సామర్లకోట: పట్టణంలో మంగళవారం సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో అనేక రోడ్లు జలమయం అయ్యాయి. సబ్ స్టేషన్ సమీపంలో పిఠాపురం రోడ్డులో విద్యుత్ వైరు తెగి పడడంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్ర 6.30 నిమిషాల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాలల్లో రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ వర్షం వల్ల రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, జయలక్ష్మి థియేటర్, సత్యనారాయణపురం, బ్రౌన్‌పేట, భాస్కర్ నగర్ నీట మునిగాయి. సుమారు రెండు నెలల నుంచి ఎండలతో అల్లాడిన ప్రజలకు వర్షం ఊరట నిచ్చింది. వర్షంతో ఉదయం నుంచి వాతావరణం చల్లబడింది. వాతావరణ అధికారులు ముందుగానే తుపాన్ హెచ్చరికను జారీ చేయడంతో రైతులు తమ పంటలను ఒబ్బిడి చేసుకున్నారు.

చల్లబడిన వాతావరణం

పిఠాపురం: భానుడి భగభగలతో అల్లాడిపోతున్న ప్రజలకు మంగళవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. మంగళవారం ఉదయం ఎండ కాసినా మధ్యాహ్నానికి ఒక్కసారిగా కారు మబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లబడింది. అనంతరం చిరుజల్లులతో వర్షం ప్రారంభమై సాయంత్రం వరకూ కురవడంతో జనం సేదదీరారు.

దొరబాబు భార్య చంద్రకళ ప్రచారం



ప్రచారం చేస్తున్న దవులూరి చంద్రకళ

సామర్లకోట: గత 20 ఏళ్ల ప్రయత్నం నెరవేరడంతో తన భర్త దవులూరి దొరబాబుకు ఎమ్మెల్యేగా ఒకసారి అవకాశం ఇవ్వాలని దవులూరి చంద్రకళ అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని 14వ వార్డులో వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, ఆకుల రామారావు, ఆకుల సూర్యనారాయణ, బి.శ్రీనివాసు, శ్రీను, లక్ష్మీ సతరరాయణ, మురళీ, మాదిగ ఐక్య వేదిక జిల్లా నాయకుడు కాళ్ల లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం 10, 11, 20 వార్డులలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- వన్నెపూడి, చిన జగ్గంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

గొల్లప్రోలు: సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మళ్లీ పట్టం కట్టాలని పిఠాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని చిన జగ్గంపేట, వన్నెపూడి గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో రూపొందించారని, తమ పార్టీకి ఎన్నికల మేనిఫెస్టో పవిత్ర గ్రంథం లాంటిదన్నారు. ప్రతి ఓటరు గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనను పోల్చి చూడాలన్నారు. చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ, రైతు రుణమాఫీ వంటి వాటి అమల్లో విఫలమై ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో మళ్లీ మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలులో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. అవ్వా, తాతలకు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛను ఇవ్వాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించవలసిన బాధ్యత సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులందరిపై ఉందన్నారు. ఇంటింటికీ మేలు చేసిన వైఎస్సార్ సీపీని ఆదరించి గెలిపించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్‌పై చంద్రబాబు దుష్ప్రచారం

- విలేకర్ల సమావేశంలో ఎన్ఆర్ఐ సభ్యులు
- 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీదే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నారైలు

సామర్లకోట: ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని ఎన్ఆర్ఐ సభ్యులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్ కోసం సిద్ధం, వై ఏపీ నీడ్స్ జగన్, ఏపీ నీడ్స్ జగన్ ఏగేన్ అనే నినాదంతో తమ వంతు సహాయంతో ఎన్ఆర్ఐ బృందం ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా మంగళవారం సామర్లకోట చేరుకున్నారు. సభ్యులు కార్తీక్ ఎల్లాప్రగడ (యూరప్), కోడూరు కృష్ణారెడ్డి (అమెరికా)బ్రహ్మానందరెడ్డి (స్విట్జర్లాండ్) వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ చట్టం ప్రకారం భూముల సర్వే జరిగితే టీడీపీ నాయకుల బినామీ భూముల బాగోతం బయట పడుతుందని అన్నారు. రైతుల భూమికి ప్రభుత్వం గ్యారంటీగా ఉంటుందని వారు చెప్పారు. చంద్రబాబు తప్పుడు ప్రచారాన్ని ఖండించడానికి తాము రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలోను వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగిస్తుందని, పెద్దాపురంలో భారీ మోజార్టీ వస్తుందని వారు తెలిపారు. దవులూరి దొరబాబు మాట్లాడుతూ స్థానిక అభ్యర్థిగా పోటీ చేయడంతో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని తెలిపారు. ఎన్ఆర్ఐ సభ్యులు కిశోర్ యాదవ్, స్రవంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగన్ అవసరం ఉంది



విలేకర్లతో మాట్లాడుతున్న గౌతమ్‌రాజు

సామర్లకోట: రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందని సినీ నటుడు గౌతమ్‌రాజ్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొరకపూడి చిన్నయ్యదొరను గౌతమ్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకుని మాట్లాడుతూ పేదల కోసం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. చంద్రబాబు తన హయాంలో గుర్తు రాని సంక్షేమ పథకాలు ఈ ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి మేనిఫెస్టో రూపంలో తీసుకువచ్చారని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు అడపా వీరభద్రరావు, ప్రత్తి శ్రీను, బైరవ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.